
సాక్షి గుంటూరు

మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



పోలింగ్ ఏర్పాట్లు పరిశీలన

ముప్పాళ్ల: ముప్పాళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎమ్.భవానీశంకర్ సోమవారం పరిశీలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 532.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 8,067 క్యూసెక్కులు విడుదలవుతోంది.



యూరియా దిగుమతి

తెనాలిటౌన్: రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా జొన్న, మొక్కజొన్న పంటలకు అవసరమైన యూరియాను సోమవారం రైలు వ్యాగన్ ద్వారా తెనాలికి దిగుమతి అయ్యింది.

న్యూస్‌రీల్

పుష్కర ఘాట్లు పరిశీలన



తాడేపల్లి రూరల్: మహాశివరాత్రి సందర్భంగా కృష్ణానది దిగువ ప్రాంతంలో పుష్కరఘాట్లకు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వేలాది మంది భక్తులు తరలి రానున్న నేపథ్యంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం కార్పొరేషన్ డీఈ రాము, ఏఈ అనూష సంబంధిత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పుణ్యస్నానాల అనంతరం దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తాగునీటిని అందుబాటులో ఉంచుతామని చెప్పారు. పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నారని, మంగళవారం సాయంత్రానికి పనులు పూర్తి అవుతాయని వివరించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి పుణ్యస్నానాలకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.

న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీగా బాధ్యతల స్వీకరణ




గుంటూరు లీగల్ : గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీగా న్యాయమూర్తి సయ్యద్ జియావుద్దీన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కోర్టు న్యాయవాదులు ఈ సందర్భంగా న్యాయమూర్తి జియావుద్దీన్‌కు అభినందనలు తెలిపారు. మొదటి జూనియర్ సివిల్ జడ్జిగా సమర్థంగా విధులు నిర్వహించి, క్రమశిక్షణకు మారుపేరుగా ఆయన అందరి మన్ననలు పొందారని పలువురు ప్రశంసించారు.

గజ వాహనంపై మల్లేశ్వరుడు



మంగళగిరి టౌన్: మంగళగిరిలోని శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం గజవాహనంపై మల్లేశ్వరుడు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళగిరి శ్రీ పద్మశాలీయ బహుత్తమ సంఘం కైంకర్య పరులుగా వ్యవహరించారు. దేవస్థాన ఈవో జె.వి. నారాయణ ఉత్సవ నిర్వహణను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతక్రింద కనకయ్య, దామర్ల కుబేరస్వామి, శివాలయం, సీతారామ దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్లు బోగి కోటేశ్వరరావు, మునగపాటి వెంకటేశ్వరరావు, వాకా మంగారావు తదితరులు పాల్గొన్నారు.

యార్డుకు 1,52,043 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,52,043 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,36,859 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,200 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 69,869 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

బేరీజు.. బేజారు

- రూ.60 కోట్ల సేవాపన్ను ఎగవేతదారునిగా ఆలపాటి
- భూకబ్జాలు, రౌడీయిజం, అనైతిక రాజకీయాలు..
- ఎన్నికల సమయంలోని కరపత్రాలు వెలుగులోకి..
- వైఎస్సార్ సీపీకి దగ్గరంటూ లక్ష్మణరావుపై ట్రోలింగ్
- పోటాపోటీగా సోషల్ మీడియాలో పరస్పర పోస్టింగులు
- అభ్యర్థుల గుణగణాలపై పట్టభద్రుల లోతైన పరిశీలన
- ఓటర్లు బేరీజు వేసుకుంటున్నారంటూ కూటమిలో బేజారు

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: ఓటర్లు నిశానీలు కారు. పట్టభద్రులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, చిరుద్యోగులు, నిరుద్యోగులు. విభిన్న రంగాలు, వర్గాలకు చెందిన 3,47,116 మంది ఓటర్లు. సోషల్ మీడియాలో ప్రధాన పోటీదారుల గుణగణాలు, గత చరిత్ర, రాజకీయ వ్యవహారాలు ఆధారసహితంగా హోరెత్తుతున్నాయి. పలు ఊహాజనిత, నిరాధార ఆరోపణలూ జోరందుకున్నాయి. ఈ ఎన్నికలు ఈవీఎంలతో కాదు బ్యాలెట్ పేపర్ పద్ధతిలో జరగనున్నాయి. తొమ్మిది నెలలుగా పచ్చమీడియా సహకారంతో పడికట్టు, కనికట్టు మాటలతో మోసగిస్తున్న ప్రభుత్వ పాలనా తీరు ప్రతిఒక్కరి కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. అసలే రాజకీయ చైతన్యవంతమైన జిల్లాలకు చెందిన పట్టభద్రులు ప్రతిదీ బేరీజు వేసుకుని కర్రుకాల్చి వాతపెడతారేమోననే బేజారు టీడీపీ నేతల మాటల్లో వ్యక్తమవుతోంది.

కూటమి నేతల్లో ఆందోళన

కృష్ణా- గుంటూరు పట్టభద్రుల స్థానానికి ఎన్నికల పోలింగ్ సమయం సమీపిస్తున్న కొద్దీ కూటమి నేతల్లో ఆందోళన అధికమవుతోంది. ఈనెల 27న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో టీడీపీకి చెందిన కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రధాన పోటీదారైన పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు మద్దతుదారులు పోటాపోటీగా సోషల్ మీడియా వార్‌కు తెరతీశారు. అభ్యర్థులిద్దరూ జిల్లా కేంద్రమైన గుంటూరుకు చెందిన వారైనప్పటికీ రాష్ట్ర రాజకీయాలలో సుపరిచితులు.



కేఎస్ లక్ష్మణరావు



ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

మాజీ మంత్రి ఆలపాటి సీనియర్ నాయకుడు. విద్యావేత్త అయిన లక్ష్మణరావు 14 ఏళ్లుగా శాసనమండలి నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. కూటమి అభ్యర్థి గురించి ఆయా సందర్భాలలో తీవ్ర అవినీతి ఆరోపణలు, ఆర్థిక అరాచకాలు, రౌడీయిజం, దాడులు లాంటి నేరారోపణలు, పలు విమర్శలు లేకపోలేదు. వాటన్నింటినీ గుర్తుచేస్తూ సోషల్ మీడియా ద్వారా ప్రజల దృష్టికి తీసుకొస్తుండటం తాజాగా చర్చనీయాంశమైంది. కూటమి నేతలకు ఇది కొరుకుడుపడని అంశంగా మారి ఆందోళన రేకెత్తిస్తోంది.

రూ.60 కోట్ల పన్ను ఎగవేత?

ఆర్థిక లావాదేవీల్లో లోపాలతోపాటు పన్నులు ఎగ్గొట్టారనే నేరారోపణలు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌పై ఉన్నాయి. అప్పీలుకు వెళ్లగా కేంద్ర ప్రభుత్వ సంస్థలు కూడా తోసిపుచ్చాయని, పన్నులు చెల్లించాల్సిందేనని హైకోర్టు నిర్ధారించిందని రాజకీయ ప్రత్యర్థులు గుర్తుచేస్తున్నారు. ఎన్.ఆర్.ఐ. విద్యా సంస్థల ద్వారా విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజుల్లో అరవై కోట్ల రూపాయలకు పైగా సర్వీసు టాక్సును ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందని, దీనిపై ఇప్పటికీ న్యాయస్థానాల్లో కేసులు కొనసాగుతున్నాయని అంటున్నారు.

- తెనాలి అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేస్తారనే అంచనాలతో ఆలపాటి రాజకీయ ఆరంగేట్రం మొదలు ఆయన అకృత్యాలంటూ ప్రత్యర్థులు కరపత్రాలు ముద్రించి మరీ ప్రజల దృష్టికి అనేక అంశాలను ఇదివరకే తీసుకొచ్చారు. పల్నాడు ప్రాంతంలో గొర్రెల పెంపకం మాటున, సాఫ్ట్‌వేర్ సంస్థ చాటున, గుంటూరులో చిట్‌ఫండ్, ఫైనాన్స్ ద్వారా, తన సంబంధీకుల పేరుతో, ఇతర బినామీల పేరిట రియల్ ఎస్టేట్ ముసుగులో అటు బ్యాంకులను, ఇటు ప్రజలను మోసం చేశారని, తన రాజకీయ పలుకుబడి, దౌర్జన్యాలతో సెటిల్‌మెంట్లు చేసుకున్నారనే ఆరోపణలు గుప్పించారు. మంత్రిగా ఉన్నప్పుడు భారీగా జిల్లాలో ఇసుక కుంభకోణాలకు పాల్పడ్డారని, ఇంజినీరింగ్ కాలేజీలకు అనుమతుల ద్వారా రూ.కోట్లు సంపాదించారని, మంగళగిరి- తాడేపల్లి పరిధిలోని ఆంధ్ర సిమెంటు ఫ్యాక్టరీని బినామీ పేర్లతో కొనుగోలుచేసి కార్మికులకు నష్టం చేశారని, విభిన్న ప్రాంతాల్లో క్రిష్టియన్ ఆస్తులను కొల్లగొట్టి స్థిరాస్తులుగా మలచుకున్నారనే తీవ్రారోపణలు లేకపోలేదు. ఎన్.ఆర్.ఐ ఆసుపత్రి వ్యవహారాల్లోనూ ఆలపాటిపై అనేక విమర్శలు రావడాన్ని గుర్తుచేస్తున్నారు.

లక్ష్మణరావుపైనా పోస్టింగులు..

పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావుపైనా సోషల్ మీడియాలో వ్యతిరేక ప్రచారం పెచ్చరిల్లుతోంది. అవినీతి ఆరోపణలు, రాజకీయపరమైన అంశాలు అటుంచి వ్యక్తిత్వ హననానికి ప్రత్యర్థులు తెగపడ్డారని, లేనిపోని విషయాలను చిలవలు పలవలు చేస్తున్నారని ఆయన మద్దతుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వినతి పత్రం ఇచ్చేప్పుడు కిందపడిన కాగితాలను తిరిగి తీసుకునే క్రమంలో లక్ష్మణరావు సీఎం పాదాలకు నమస్కరించారని, ఆయన వైఎస్సార్ సీపీ మద్దతుదారు అని ట్రోల్ చేయడం వారి దిగజారుడుతనానికి పరాకాష్ఠ అంటున్నారు. మూడు పర్యాయాలు పీడీఎఫ్ సభ్యునిగా శాసన మండలికి ఎన్నికై విభిన్న అంశాలను చర్చకు తీసుకొచ్చి, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేసిన లక్ష్మణరావుపై యూటీఎఫ్ తదితర సంఘాల పేరిట తప్పుడు పోస్టింగులు కూడా పెట్టిస్తుండటాన్ని ఆయా సంఘాల నేతలు ఖండిస్తున్నారు. కె.ఎస్.లక్ష్మణరావుపై తప్పుడు ప్రచారం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు సోమవారం ఫిర్యాదులు చేయడం గమనార్హం.

వైభవంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

- శ్రీ వనదుర్గాదేవి అలంకరణలో అమ్మవారు దర్శనం
- విద్యుద్దీప కాంతులతో శివాలయం కళకళ





విద్యుత్ దీప కాంతులలో శివాలయం (ఇన్‌సెట్లో) వనదుర్గాదేవిగా భ్రమరాంబ దర్శనం

పెదకాకాని: మహా శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఉత్సవాల రెండో రోజు సోమవారం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఏకదశి పూర్వాషాఢ నక్షత్రం రోజున శ్రీ భ్రమరాంబ అమ్మవారు వనదుర్గాదేవిగా భక్తులను అనుగ్రహించారు. ప్రత్యేక వేదికపై శ్రీ రామలింగ ప్రతిష్ఠ అలంకరించారు. ఆలయంలో తెల్లవారు జామున 5 గంటలకే సుప్రభాత సేవ, పంచహారతులతో పూజా కార్యక్రమాల క్రతువును వేదపండితులు ప్రారంభించారు. ఉదయం 7 గంటలకు గ్రామ బలిహరణ, 8.30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహానివేదన, సాయంత్రం 5 గంటలకు నిత్యోపాసన, గ్రామ బలిహరణ, పంచ హారతులు, 6.30 గంటలకు నరనంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి వేళ సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా వల్లభాపురం రమాదేవిచే భజన కార్యక్రమం, ఖమ్మం లక్ష్మీ బృందంచే భక్తిరంజని, విజయవాడ ఉమామహేశ్వర కళాక్షేత్రం వారిచే చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. రాత్రి 8.30 గంటలకు పెదకాకాని కె.వెంకటేశ్వరరావుచే శ్రీకృష్ణరాయబారం సన్నివేశం, గుంటూరు విజయదుర్గా నాట్య కళా సమితి వారిచే శ్రీ రామాంజనేయ యుద్ధం నుంచి యుద్ధ సన్నివేశాలు పౌరాణిక ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం విద్యుత్ దీప కాంతులలో కళకళలాడుతోంది. శివాలయంలో భ్రమరాంబ అమ్మవారు మంగళవారం శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులను అనుగ్రహించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు.

ఓట్ల లెక్కింపు సక్రమంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలలో పోలయ్యే ఓట్లను సక్రమంగా లెక్కించాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో సంయుక్త కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజులతో కలసి కౌంటింగ్ విధులకు హాజరుకానున్న అధికారులకు జిల్లా కలెక్టర్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... శాసన మండలి ఎన్నికలు బ్యాలెట్ పేపరు, మొదటి ప్రాధాన్యత ఓటు నమోదు విధానం ద్వారా జరుగుతుందన్నారు. అభ్యర్థి విజయం సాధించాలంటే పోలైన ఓట్లలో 50 శాతం కంటే ఒక్క ఓటు అధికంగా రావాల్సి ఉంటుందన్నారు. ఎన్నికలు 483 పోలింగ్ బూత్‌లలో నిర్వహిస్తున్నందున ఓట్ల లెక్కింపునకు 28 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సంయుక్త కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్ జిల్లాల డీఆర్‌ఓలు ఎన్ ఎస్‌కే ఖాజావలి, మురళి, గంగాధర గౌడ్, చంద్రశేఖర్, ఏలూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి పాల్గొన్నారు.

బ్యాలెట్ బాక్స్‌ల పరిశీలన

పోలింగ్ సిబ్బందికి అందించాల్సిన బ్యాలెట్ బాక్సులు, స్టాట్యుటరీ, నాన్ స్టాట్యుటరీ ఫారాలతో కూడిన కిట్లను సోమవారం రాత్రి స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఎ. భార్గవ్ తేజలు పరిశీలించారు. జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసుకు పలు సూచనలిచ్చారు.

నిమిషాల వ్యవధిలో విగతజీవులై...

- విద్యుత్ షాక్‌తో ముగ్గురు కూలీలు, భక్తుడు మృతి
- సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేస్తుండగా దుర్ఘటన
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ, ఆర్డీఓలు
- మృతదేహాల వద్ద కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ



మహంకాళిరావు, వెంకటబాలయ్య, కాళీబాబు (ఫైల్)

పెదకాకాని: నాలుగు నిండు ప్రాణాలు విద్యుత్ షాక్‌తో నిమిషాల వ్యవధిలో గాలిలో కలిసిపోయాయి. రెక్కాడితేగానీ డొక్కాడని వారి జీవితాల్లో విద్యుత్ షాక్ విషాదాన్ని నింపింది. ఒకేసారి నలుగురు మృతి చెందడంతో వారి కుటుంబాలలోని పెద్దవారు, చిన్నారులు కన్నీరుమున్నీరుగా విలపించడం స్థానికులను సైతం కంటతడి పెట్టించింది. మండల కేంద్రమైన పెదకాకాని శివారులో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించే శ్రీ హనుమత్ శ్రీ వరప్రసాద్‌బాబూజీ ఆశ్రమం కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతోంది. ఇక్కడ 70కి పైగా ఆవులు ఉన్నాయి. వాటికి పెద్ద షెడ్డు ఏర్పాటు చేశారు. రోజూ శుభ్రం చేసేందుకు తెనాలికి చెందిన గందాల మహంకాళిరావు, ఏటగిరి వెంకటబాలయ్య, దుగ్గిరాల మండలం పెనుమూలికి చెందిన ఏకుల రాజేష్‌లు ఏడాదిగా పనిలో కొనసాగుతున్నారు. పది అడుగుల లోతులో మూడు సెప్టిక్ ట్యాంక్‌లు ఏర్పాటు చేశారు. షెడ్డు పక్కనే ఏర్పాటు చేసిన ఈ ట్యాంక్‌లు(సంప్)లు నిండినప్పుడు వ్యర్థాలను అదే పొలంలోకి కంప్రెషర్ (విద్యుత్ పరికరం) ద్వారా బయటకు పంపుతుంటారు. సోమవారం సాయంత్రం గందాల మహంకాళిరావు ఆ సంపులో ఒక ఇనుప నిచ్చెన వేసి దానిపై నిలుచుని వ్యర్థాలు బయటకు పంపుతున్నాడు. చేతిలోని కంప్రెషర్‌కు కరెంటు సరఫరా కావడంతో పెద్దగా కేకలు వేశాడు. పక్కనే ఉన్న రాజేష్ పరిగెత్తుకుని వచ్చి అతడిని పైకిలాగే ప్రయత్నంలో అతుక్కు పోయాడు. వారిని కాపాడేందుకు వెళ్లిన ఏటగిరి వెంకటబాలయ్య కూడా ప్రమాదానికి గురయ్యాడు. అదే షెడ్డులో గోసేవ చేస్తున్న భక్తుడు మండడి కాళీబాబు కూడా కాపాడే ప్రయత్నంలో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. అక్కడే పనులు చేస్తున్న మరో ఇద్దరు కూలీలు కరెంట్ షాక్ ప్రమాదాన్ని గుర్తించి సరఫరా నిలిపివేశారు. అప్పటికే నలుగురు ప్రాణాలు కోల్పోయారు. సత్తెనపల్లి తాలూకా కట్టమూరుకు చెందిన మండడి కాళిబాబుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరిద్దరు అమెరికాలో స్థిరపడ్డారు. భార్య నాగవర్ధినితో కలసి ఆశ్రమానికి భక్తుడిగా వచ్చిన ఆయన పది సంవత్సరాలుగా ఇక్కడే సేవలు అందిస్తున్నారు. గందాల మహంకాళిరావు(28)కు భార్య దుర్గాశ్రావణి, ఇద్దరు సంతానం ఉన్నారు. ఏటగిరి వెంకటబాలయ్య(35)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా.. ఏకుల రాజేష్‌కు(20) ఇంకా వివాహం కాలేదు. సంఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకున్న సీఐ టి.పి. నారాయణస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దురదృష్టకరం: జిల్లా ఎస్పీ

ఈ ఘటన దురదృష్టకరమని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన తర్వాత ఆయన మట్లాడుతూ.. చేతిలో కంప్రెషర్ ఉంచుకోవడం, ఇనుప నిచ్చెన వాడటం వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని తెలిపారు. ఎస్పీ వెంట గుంటూరు ఆర్డీఓ కె. శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

అమరేశ్వర క్షేత్రానికి వెండి ఆభరణాలు

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరుని ఆలయంలోని ఉత్సవమూర్తులకు ధరణికోటకు చెందిన పత్రా వేణుబాబు, నిత్య దంపతులు 1,137 గ్రాముల బరువుగల పాదాలు, తదితర వెండి ఆభరణాలు సోమవారం సమర్పించారు. సోమవారం అమరేశ్వరునికి బాలచాముండేశ్వరికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మేళతాళాలతో దాతలు ఆలయ ప్రదక్షిణ చేసి సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి ఈఓ సునీల్‌కుమార్‌కి ఆభరణాలు అప్పగించారు. అమరేశ్వర క్షేత్రంలోని సుబ్రమణ్యేశ్వరస్వామికి రజిత ముఖకవచం, యజ్ఞోపవీతాన్ని అమరావతికి చెందిన రాఘవపురపు అప్పారావు, దంపతులు సోమవారం సమర్పించారు. తొలుత స్వామికి పూజలు నిర్వహించిన అనంతరం ఈవో సునీల్‌కుమార్‌కి ఆభరణాలు అప్పగించారు.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 5,000 గరిష్ఠం : రూ. 6,300

మోడల్ ధర రూ. 5800

క్లుప్తంగా

క్రీడాకారులకు స్పోర్ట్స్ స్టైఫండ్ కోసం దరఖాస్తులు

లక్ష్మీపురం: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు 2025–26 సంవత్సరానికిగాను ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారు వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన 15, 24 సంవత్సరాల వయస్సు ఉన్న గ్రామీణ, పట్టణ క్రీడాకారులకు స్పోర్ట్స్ స్టైఫండ్ అవార్డు కోసం దరఖాస్తును ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి సోమవారం తెలిపారు. పురుషులకు ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్, పురుషులు, మహిళలకు టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్ లో ఆసక్తి ఉన్న క్రీడాకారులు మార్చి 6వ తేదీ లోగా ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. మరిన్ని వివరాలకు ఎఫ్‌సీఐ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూఎఫ్‌సీఐ.జీఓవీ.ఐఎన్ ని సంప్రదించాల్సిందిగా సూచించారు.

27న నిధి ఆప్‌కే నికట్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికట్ కార్యక్రమాన్ని ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఎస్. శ్రీకాంత్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న సమావేశాల్లో యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖి చర్చలు జరుగుతాయని తెలిపారు. ఈనెల 27న సెలవు దినంగా పరిగణించినచో మరుసటి రోజున అదే వేదికల వద్ద యథావిధిగా నిధి ఆఫ్ కే నికట్ జరుగుతుందని తెలిపారు. పీఎఫ్ భాగస్వామ్య యజమానులందరూ కార్యక్రమానికి విధిగా హాజరై, ఫిర్యాదులు ఉంటే వాటిని పరిష్కరించేందుకు వీలుగా ఉద్యోగులతో పాటు అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నిధి ఆప్‌కే నికట్ కార్యక్రమానికి హాజరుకాగోరు వాటాదారులు, ఇతర శాఖల అధికారులు సూచనలు చేయవచ్చని తెలిపారు. గుంటూరు గోరంట్లలోని భారతి కన్స్యూమర్ కేర్ ప్రొడక్ట్స్, కృష్ణాజిల్లా బాపులపాడు మండలం మల్లవల్లి ఫ్లాట్ నంబరు–16లోని ఏపీఐఐసీ మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో మోహన్ స్పింటెక్స్, ప్రకాశం జిల్లా మార్టూరులోని దుర్గామల్లీశ్వరి ఆలయం ఎదుట ఉన్న శ్రీశారదానికేతన్ పబ్లిక్ స్కూల్, విజయవాడ ఆటోనగర్‌లోని ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ బిల్డింగ్స్ రెండో అంతస్తు, బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం చందోలులోని ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామంలోని శ్రీసిమెంట్ లిమిటెడ్‌లో నిర్వహించనున్న నిధి ఆప్‌కే నికత్‌లో యజమానులందరూ పాల్గొని ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

కోర్కెలు తీర్చే బాలకోటేశ్వరుడు


క్వారీ బాలకోటేశ్వరస్వామి మూల విరాట్


తిరునాళ్లకు సిద్ధమైన దేవాలయం


ఆలయ ధర్మకర్త చీమకుర్తి యలమందయ్య సమాధి

- భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి
- మహా శివరాత్రి తిరునాళ్లకు సన్నద్ధం

చేబ్రోలు: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీలోని శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవాలయం సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. రంగులతో ఆలయాన్ని చక్కగా తీర్చిదిద్దారు. జిల్లాలో కోటప్పకొండ తిరునాళ్ల తరువాత చెప్పుకోదగినది ఇదే. భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా ఇక్కడి స్వామి విరాజిల్లుతున్నారు. సుమారు వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన ఆలయం వద్ద సుమారు 80 సంవత్సరాలుగా ఏటా తిరునాళ్ల జరుగుతోంది. మొదటిసారిగా చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామస్తులు ప్రభను తిరునాళ్లకు తీసుకొచ్చినట్లు ప్రతీతి.

ఇదీ తిరునాళ్ల నేపథ్యం...

1920వ సంవత్సరంలో చీమకుర్తి యలమందయ్య వడ్లమూడి గ్రామంలోని తన పొలం దున్నుతుండగా శివలింగం బయటపడింది. విగ్రహాన్ని అక్కడే ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు చేశారు. గ్రామంలో అరిష్టాలు జరగటంతో దీనికి కారణం విగ్రహానికి పూజా కార్యక్రమాలు నిర్లక్ష్యం చేయటమేనని స్థానికులు భావించారు. ఓ రోజు యలమందయ్యకు కలలో బాలకోటేశ్వరస్వామి కనిపించి తనకు గుడి నిర్మించి పూజలు చేయవలసిందిగా ఆజ్ఞాపించారని ప్రచారం ఉంది. స్వామి వారి ఆజ్ఞానుసారం యలమందయ్య పొలంలో లభించిన శివలింగానికి గుడి కట్టించి పూజాది కార్యక్రమాలు చేయించారు. దేవుని సేవలో నిమగ్నమయ్యారు.


తిరునాళ్లకు వచ్చిన భారీ విద్యుత్ ప్రభలు (ఫైల్)

మొదటి సారిగా మండలంలోని గొడవర్రు గ్రామస్తులు ప్రభను తిరునాళ్లకు తీసుకువచ్చారు. అప్పటి నుంచి గొడవర్రు గ్రామ ప్రభ దేవాలయానికి మహాశివరాత్రికి ముందు వరుసలో ఉంటుంది. శివరాత్రి సందర్భంగా జరిగే తిరునాళ్లకు జిల్లా నలుమూలల నుంచి సుమారు లక్ష మంది భక్తులు వస్తుంటారు. ఆలయ ధర్మకర్త యలమందయ్య కోరిక మేరకు ఆయన మరణానంతరం ఆలయానికి ఆగ్నేయ దిశలో తెనాలి రోడ్డు పక్కనే సమాధి చేశారు. కాలక్రమంలో భక్తుల రాక పెరగటంతో ఆలయం అభివృద్ధి చెందింది. సూర్యదేవర వెంకటప్పయ్య అనే భక్తుడు నిజాంపట్టణం మండలం నక్షత్ర నగర్‌లో తనకు ఉన్న ఎకరం భూమిని ఆలయ నిర్వహణకు రాసిచ్చారు. జిల్లాలో వడ్లమూడి క్వారీ తిరునాళ్లకు ఆదరణ, గుర్తింపు లభించటంతో అధికారులు ఈ ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తెచ్చారు. కోరిన కోర్కెలు తీరతాయని భక్తుల నమ్మకం. భారీ విద్యుత్ ప్రభలు ఈ తిరునాళ్లలో ప్రత్యేక ఆకర్షణ. నారాకోడూరు, గుండవరం, గొడవర్రు, సుద్దపల్లి, చేబ్రోలు, శలపాడు, శేకూరు, వడ్లమూడి గ్రామాల నుంచి 15 వరకు భారీ విద్యుత్ ప్రభలు, వందల సంఖ్యలో చిన్న ప్రభలు తిరునాళ్లకు దేవాలయానికి వస్తాయి. ఆలయం వద్ద ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. ఈ నెల 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా 26వ తేదీన జరిగే మహాశివరాత్రి తిరునాళ్ల సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావుపై తప్పుడు ప్రచారం

ఐద్వా కార్యదర్శి రమాదేవి

తెనాలిరూరల్: ఓటమి భయంతోనే పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిపై పాలక పక్షం అసత్య ప్రచారం, ఆరోపణలు చేస్తున్నారని, దమ్ముంటే ఆధారాలతో నిరూపించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి సవాల్ చేశారు. ఈనెల 27న జరగనున్న ఉమ్మడి కృష్ణ– గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉపాధ్యాయ, ఉద్యోగ, నిరుద్యోగ, కార్మిక, ఎన్జీవో సంఘాలు బలపరిచిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం ప్రచారం నిర్వహించారు. తెనాలి కోర్టుల ప్రాంగణానికి వెళ్లిన ఆమె అక్కడ న్యాయవాదులతో మాట్లాడారు. లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్సీగా లక్ష్మణరావు విజయం నిరుద్యోగులు, ఉద్యోగులు, పట్టభద్రులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది విజయంగా పేర్కొన్నారు. ఆయా వర్గాల సమస్యలపై శాసనమండలిలో లక్ష్మణరావు అలుపెరుగని పోరాటం చేశారన్నారు. శాసనమండలి రికార్డులను పరిశీలిస్తే లక్ష్మణరావు పోరాట పటిమ అర్థమవుతుందని వివరించారు. అలాంటి వ్యక్తి మరొకరి కాళ్లు పట్టుకున్నారంటూ అసత్య ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. పూర్తిస్థాయి ఆధారాలుంటే ఇప్పటికైనా నిరూపించాలని సవాలు చేశారు. కేవలం అసెంబ్లీ ఎన్నికలలో తెనాలి సీటు దక్కలేదన్న కారణంగా ఎమ్మెల్సీ స్థానంలో పోటీ చేసేందుకు ఆ పార్టీ అవకాశం కల్పించిందని, అలాంటి వ్యక్తులను గెలిపిస్తే సమస్యలపై పోరాడే సత్తా ఉండదని ఓటర్లు గమనించాలని కోరారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలలో మంచి ప్రభుత్వం కోసం ప్రజలు ఓటు వేశారని, అయితే వారి ఆశలను ఆవిరి చేసే ప్రభుత్వంగా ప్రస్తుత ప్రభుత్వం ఉందన్నారు. అందుకు తాజా ఉదాహరణ గ్రూప్–2 పరీక్షకు హాజరయ్యే 92 వేల మంది అభ్యర్థులు సాంకేతిక సమస్యలపై రోడ్డెక్కినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. విజ్ఞులైన పట్టభద్రులు వివేకంతో ఆలోచించి మొదటి ప్రాధాన్యత ఓటును లక్ష్మణరావుకు వేసి గెలిపించాలని ఆమె కోరారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములక శివసాంబిరెడ్డి, ఎస్.భవన్నారాయణ, సీఐటీయూ నాయకుడు షేక్ హుస్సేన్ వలి, న్యాయవాది స్టాలిన్ పాల్గొన్నారు.


కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో మాట్లాడుతున్న రమాదేవి

క్వారీ తిరునాళ్లకు ట్రాఫిక్ మళ్లింపు

నగరంపాలెం: వడ్లమూడి క్వారీ తిరునాళ్లను పురస్కరించుకుని ట్రాఫిక్‌ను మళ్లించినట్లు చేబ్రోలు పోలీసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు– తెనాలి వైపు వెళ్లే వాహనాలు బుడంపాడు అండర్ పాస్ నుంచి ఎడమ వైపుగా తక్కెళ్లపాడు– ఉప్పలపాడు– కొలకలూరు– నందివెలుగు మీదుగా వెళ్లాలని, తిరుగు ప్రయాణంలోనూ అదే మార్గంలో పయనించాలని సూచించారు.

- గుంటూరు– పొన్నూరు వైపు వెళ్లే వాహనాలు.. బుడంపాడు అండర్‌పాస్ నుంచి కుడి వైపుగా ఏటుకూరు బైపాస్ నుంచి ప్రత్తిపాడు– పెదనందిపాడు– కాకుమాను మీదగా పొన్నూరు వెళ్లి, అదే మార్గంలో రాకపోకలు చేయాలని కోరారు.
- గుంటూరు నుంచి తిరునాళ్లకు వెళ్లే వాహనాలు.. నారాకోడూరు మినీ బైపాస్ మీదగా తిరునాళ్లకు చేరాల్సి ఉంది. తిరిగి వెళ్లే వాహనాలు వేజెండ్ల అడ్డరోడ్డు ఎదురున్న రోడ్డు నుంచి చేబ్రోలు చేరుకుని రెడ్డిపాలెం– లేమల్లెపాడు– ఏటుకూరు మీదగా గుంటూరు చేరుకోవాల్సి ఉందని చెప్పారు.
- పొన్నూరు నుంచి తిరునాళ్లకు వచ్చే వాహనాలన్నీ చేబ్రోలు నుంచి వడ్లమూడి వెళ్లే మార్గం ద్వారా తిరునాళ్లకు చేరాలి. మరలా అదే మార్గంలో వెళ్ళాలని తెలిపారు. భక్తులు, ప్రజలు, సందర్శకులు పోలీసుల సూచనలు పాటించి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సహకరించాలని తెలిపారు.

కేఎస్‌కు వైఎస్సార్ టీఎఫ్ మద్దతు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 27న జరగనున్న కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ తరఫున పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు మద్దతు ప్రకటిస్తున్నట్లు వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ సాగర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫెడరేషన్ రాష్ట్ర నాయకుల సూచన మేరకు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో భాగంగా గుంటూరు, కృష్ణా జిల్లాల అధ్యక్షులు వై.ధామస్‌రెడ్డి, మహంకాళిరావు, ఇతర నాయకుల సమక్షంలో కేఎస్ లక్ష్మణరావుకు మద్దతు ప్రకటిస్తూ, తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు.

తప్పించుకున్న వారెంట్ నిందితుడి అరెస్ట్

మంగళగిరి: పోక్సో కేసులో అరెస్టు అయ్యి కొద్ది రోజుల శిక్ష అనంతరం కోర్టు వాయిదాలకు తిరుగుతున్న నిందితుడిని మంగళగిరి రూరల్ ఎస్ఐ ఎస్.వెంకట్ అరెస్ట్ చేశాడు. ఎర్రబాలెం గ్రామానికి చెందిన కొల్లి మోహన్ 2019 సంవత్సరంలో బాలికను లైంగికంగా వేధించడంతో పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. అనంతరం జైలు నుంచి విడుదలయ్యాడు. కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతుండడంతో జడ్జి నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేశారు. దీంతో సోమవారం పోలీసులు అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించింది.

అంబటిని కలిసిన పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు


అంబటికి కృతజ్ఞతలు తెలుపుతున్న పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబును సోమవారం వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులుగా నియమితులైన పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్ధార్థనగర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శేషగిరి పవన్‌కుమార్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పూట్ల పాలశ్రీనివాసరావు, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు, ఇంటలెక్చువల్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఈమని రాఘవరెడ్డి, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వీరిశెట్టి సుబ్బారావు, ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మేడా వెంకటేశ్వరరావు, వలంటీర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉద్దగిరి మురళీ అంబటిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ పదవి అనేది కేవలం అలంకారం కాదని, అది మనపై మరింత బాధ్యత పెంచుతుందన్నారు. పార్టీ పదవులు పొందిన ప్రతి ఒక్కరూ పార్టీ పటిష్టత కోసం పాటుపడాలన్నారు. ఆయా అనుబంధ విభాగాలను బలోపేతం చేసే దిశగా ముందుకు సాగాలన్నారు. నూతనంగా నియమితులైన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.

పొగాకు బోర్డు వైస్ చైర్మన్‌గా బ్రహ్మయ్య

కర్నాటక పంట పరిమాణం 100 మిలియన్ కిలోలు


మాట్లాడుతున్న బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

కొరిటెపాడు(గుంటూరు): 164వ పొగాకు బోర్డు సమావేశం గుంటూరు జీటీ రోడ్‌లోని బోర్డు ప్రధాన కార్యాలయంలో బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ అధ్యక్షతన సోమవారం సాయంత్రం జరిగింది. సమావేశంలో పలు తీర్మానాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో కర్నాటక ప్రాంత పంట కాలానికి పంట పరిమాణంను నిర్ధారించారు. బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబులు మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్, ఇండియన్ టుబాకో అసోసియేషన్(ఐటీఏ), పొగాకు ఎగుమతిదారులు ఇచ్చిన ఇండెంట్ అనుగుణంగా 2025–26 కర్నాటక ప్రాంత పంట కాలానికి 100 మిలియన్ కిలోల పరిమాణాన్ని నిర్ధారించినట్లు వివరించారు. అంతేకాకుండా పొగాకు బోర్డు వైస్ చైర్మన్‌గా బొడ్డపాటి బ్రహ్మయ్యను సభ్యులందరూ ఎన్నుకున్నట్లు వారు వెల్లడించారు. బోర్డు పాలకవర్గ సభ్యులు హెచ్‌సీ బసవరాజు, మారెడ్డి సుబ్రమణ్యేశ్వరరెడ్డి, గుత్తా వాసుబాబు, బి.రమేష్‌పాయ్, విక్రమ్ రాజ్, పొద వరప్రసాద్, హెచ్‌ఆర్ దినేష్ పాల్గొన్నారు. వర్చువల్ కాన్ఫరెన్స్ విధానంలో ఐఏఆర్ఎస్ డిప్యూటీ సెక్రటరీ మౌనికా గౌర్, డాక్టర్ మాగుంట శేషు మాధవ్ పాల్గొన్నారు.

మిర్చి క్వింటా రూ.20 వేలకు కొనాలి

- మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా చర్యలు చేపట్టండి
- రూ.11,781 కన్నా తగ్గితే సాయం చేస్తామనడం సరికాదు
- మిర్చి యార్డును సందర్శించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి


మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతున్న మిర్చి రైతులను ఆదుకునేందుకు వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.20 వేలకు కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలసి సోమవారం ఉదయం ఆయన గుంటూరు మిర్చి యార్డును సందర్శించారు. రైతులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గుంటూరు బ్రాడీపేటలోని జిల్లా సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిర్చి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం కొనుగోలు ప్రారంభిస్తే ధరలు పెరుగుతాయని తెలిపారు. రూ.11,781కి కన్నా తగ్గితే సాయం చేస్తామని సీఎం చెప్పడం రైతులను దగా చేయడమేనన్నారు. కూటమి ప్రభుత్వం తీరు హాస్యాస్పదంగా ఉందన్నారు. యార్డులో 100 ఏళ్లుగా ఉన్న కొనుగోలు పద్ధతులే ఇప్పటికీ కొనసాగుతున్నాయని తెలిపారు. మిర్చి యార్డులో జరుగుతున్న మోసాలను ఆర్టిఫిషియల్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ ద్వారా ఎందుకు కనుగొనలేకపోతున్నారని ప్రశ్నించారు. యార్డులో రైతులకు సాయం చేసేందుకు ఒక్క అధికారి కూడా లేరన్నారు. ధరలు సగానికి సగం పడిపోతే, మార్కెట్ ఇంటర్ వెన్షన్ పథకం ద్వారా రైతులను ఆదుకోకుండా రూ.11,781 కన్నా ధర తగ్గితే సాయం చేస్తామనడం రైతులను మోసం చేయడమేనని అన్నారు. బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ ధరను ప్రామాణికంగా తీసుకుంటే రైతులకు ఎకరాకు రూ. రెండు లక్షల వరకు నష్టం వస్తుందన్నారు. యార్డులో మిర్చి ధర క్వింటాలు రూ.9 వేలు ఉండగా రిటైల్ మార్కెట్‌లో ధరలు భారీగా పెంచి విక్రయిస్తున్నారని తెలిపారు. రైతుకు కిలోకి రూ.90 దక్కితే వినియోగదారుల వద్ద వ్యాపారులు కిలో రూ.400 వరకు వసూలు చేస్తున్నారని అన్నారు. ఈ దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. గత ఏడాది మిర్చి విస్తీర్ణం తగ్గిందని, దిగుబడి కూడా పడిపోయిందని వ్యాపారులు సిండికేట్ అయి ధరలను తగ్గించేస్తున్నారని ధ్వజమెత్తారు. అలాగే ఎగుమతులు కూడా అలాగే జరుగుతున్నాయని తెలిపారు. కృష్ణపట్నంలో అదాని గ్రూపు కంటైనర్ డిపోను చెన్నెకి తరలించడం వల్ల వ్యాపారులకు ఇబ్బందులు వచ్చాయన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో అమెరికా ధరలు నిర్ణయించకపోవడం వల్ల వ్యాపారులు మిర్చి ధరలు తగ్గించినట్టు ఆరోపించారు. ఈ ఏడాది మిర్చితో పాటు వరి, పత్తి, టమాటా వంటి ముఖ్యమైన పంటలు ధరలు తగ్గి రైతులు నష్టపోయారని అన్నారు. ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగం సంక్షోభంలో ఉందని తెలిపారు. మిర్చితోపాటు అన్ని రకాల ఉత్పత్తులకు ఈ ఏడాది ధరలు రావడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు వై.కేశవరావు, గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పాల్గొన్నారు.

ఉత్సవాలకు అగస్త్యేశ్వరాలయం ముస్తాబు

కొలకలూరులోని శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయం చారిత్రక విశిష్టత కలిగినది. దక్షిణ భారతదేశం సందర్శనలో భాగంగా వచ్చిన అగస్త్య మహర్షి తన నిత్యపూజల నిమిత్తం ప్రతిష్ఠించిన లింగం ఇక్కడి ఆలయంలో కొలువైంది. అందుకే స్వామిని ఆ మహాముని పేరుతోనే పిలుస్తారు. మహా పాశుపత బంధ ఆలయాలు/త్రిలింగ క్షేత్రాల్లో మొదటిదిగా ఈ ఆలయం ప్రసిద్ధి చెందింది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఇక్కడ జరిగే రథోత్సవానికి విశేష ప్రాముఖ్యత ఉంది. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి.


ఆలయం


స్వామివార్ల ఉత్సవ విగ్రహాలు

తెనాలి: శివుడి ఆజ్ఞ ప్రకారం అగస్త్య మహాముని భార్య లోపాముద్ర, శిష్యప్రశిష్య గణంతో దక్షిణదేశానికి తరలివచ్చారని ప్రతీతి. ఆ యాత్రలో తాను బస చేసిన ప్రతి ప్రదేశంలో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. 'ఆది దంపతుల కళ్యాణం చూసే భాగ్యం లేదా' అని ప్రశ్నించిన అగస్త్య మునికి, ఆయన ఎక్కడ ఉంటే అక్కడి నుంచే తన వివాహాన్ని చూసేలా మహాశివుడు వరం ప్రసాదిస్తాడు. మహర్షి ప్రతిష్ఠించిన ప్రతి లింగం, స్వయంభూలింగంగా, తాను స్వయంగా పూజలు అందుకునేదిగా, భక్తుల మనోభీష్టాలను నెరవేర్చేదిగా వర్ధిల్లుతుందని కూడా వరమిచ్చారట శివుడు. ఫలితంగానే అగస్త్య మహాముని తొలి యుగంలో ప్రతిష్ఠించిన అన్ని లింగాలు నేటికీ పూజలు అందుకుంటున్నాయి. వీటిలో కొన్ని ప్రసిద్ధ క్షేత్రాలుగా విలసిల్లుతున్నాయి. అలాంటి దేవాలయాల్లో కొలకలూరులో అగస్త్యేశ్వర స్వామి ఆలయం ఒకటి. పూర్వం ప్రజలు నీటి వసతి కలిగిన చోటునే నివసిస్తుండేవారు. మహర్షులు తమ ఆశ్రమాలను నదీతీరాల్లో నిర్మించుకున్నారు. కృష్ణా బారేజి నిర్మించకముందు వరకు తెనాలి ప్రాంతం కృష్ణానదీ తీరప్రాంతంగానే ఉండేది. వర్షాలకు తరచూ ఈ ప్రాంతం వరదలు చుట్టుముట్టేవి. అందుకే పాత తెనాలిలో తొలినాటి ఇళ్లు మెరకపై కనిపిస్తాయి. తెనాలి దగ్గర్లోని కొలకలూరులో అప్పట్లో వందకుపైగా కొలనులు ఉండేవట. అందుకే ఈ గ్రామాన్ని కొలనులు ఊరు అని వ్యవహరించేవారని, అదే కాలక్రమంలో కొలకలూరుగా మారిందనే వాడుక ఉంది. మహాశివుడు అర్ధనారీశ్వరుడని తెలిసిందే. అందుచేత మహర్షులు లింగాన్ని మాత్రమే ఆరాధించేవారు. ఆ క్రమంలో అగస్త్య మహాముని లింగ ప్రతిష్ఠ చేసిన ప్రదేశంలో తర్వాతికాలంలో దేవాలయ నిర్మాణం జరిగింది. తొలిగా ఆలయ నిర్మాణం ఎవరు చేశారన్నదీ స్పష్టంగా తెలియకున్నా, ప్రస్తుత ఆలయ తొలిరూపం చాళుక్యుల కాలంలో జరిగిందని చెబుతారు. హిందూ సంస్కృతి నిరంతరం అగ్రస్థానంలో ఉండేందుకు ఆలయాలే ప్రధానమని నమ్మిన రాజరాజ నరేంద్రుడు అందుకోసం పూనుకొన్నాడు. పురాతన విగ్రహాలకు నూతన ఆలయాలు, కొత్త ఆలయాలను నిర్మించాడు. అందులో భాగంగా ప్రతి గ్రామంలో శివాలయం, విష్ణు ఆలయం కట్టించాడు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో నదీతీరంలో కనిపించే ఆలయాల్లో ఎక్కువశాతం వీరి పాలనలోనే అంటే 11వ శతాబ్దంలోనే నిర్మించినవి. చాళుక్యులు నిర్మించిన ఈ ఆలయాన్ని తర్వాత ఎందరో రాజులు సందర్శించారు. కాకతీయ పాలకులు సేనాని సోమయ వెంకం శిథిలావస్థకు చేరిన ఈ ఆలయాన్ని పునర్ నిర్మించారు. ఆలయ నిర్వహణకు భూరి వితరణ చేశారు. తర్వాత మూనూరి జమీందార్లు ఆలయ నిర్వహణ చేసిన ఆధారాలున్నాయి. అమరావతి రాజధానిగా పాలించిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు ఆలయ అభివృద్ధికి తోడ్పడ్డారు. తొలిరోజుల్లో స్వామి వారి లింగం మాత్రమే ఉండగా, తర్వాతికాలంలో శ్రీవీరభద్రస్వామి, శ్రీపార్వతి అమ్మవారు, వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధులు, నవగ్రహ మండపం ఏర్పాటయ్యాయి. దసరా, శివ ముక్కోటి, కార్తికమాసం, శివరాత్రి కళ్యాణం వేడుకగా జరుగుతాయి. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 24న ధ్వజావరోహణం జరిగింది. 26న లింగోద్భవ అభిషేకం, స్వామివారి కళ్యాణం, 27న రథోత్సవం జరుగుతాయని ఆలయ ఈవో ఎ.నరసింహమూర్తి చెప్పారు.